నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 22 జూన్ 2024 | HYDERABAD

ఆర్టీఏ ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో కొందరు ఆర్టీఏ సిబ్బందిమంటూ వాహనాలు ఆపుతున్న దృశ్యం. (యూనిఫాంలో ఉన్నా..నేమ్ ప్లేట్ లేదు)

హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన యోగా డేలో పాల్గొన్న అధికారి జొన్నలగడ్డ స్నేహజ

ఏయ్..ఆగు.. పేపర్లున్నయా?

ఆర్టీఏ సిబ్బందిమంటూ.. తనిఖీలు

- ఖైరతాబాద్ కార్యాలయానికి కూతవేటు దూరంలో వాహనాలు ఆపుతున్నవైనం
- యూనిఫాంలో ఉండి.. నేమ్ ప్లేట్ లేకుండా..
- ధ్రువీకరణ పత్రాల్లేని వాహనదారులకు బెదిరింపులు
- ఇష్టానుసారం వసూళ్లు..పట్టించుకోని అధికారులు

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : అది ఖైరతాబాద్ ఆర్టీఏ ప్రధాన కార్యాలయం. కమిషనర్, జేటీసీ ఉన్నతాధికారులు ఉంటారు. ఆ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఆర్టీఏ సిబ్బందిమంటూ.. కొందరు వ్యక్తులు వాహనాలను ఆపి.. బెదిరింపులకు పాల్పడుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నేమ్ ప్లేట్ లేని.. యూనిఫాం ధరించి తనిఖీ అధికారి పర్యవేక్షణ కూడా లేకుండా ఇష్టానుసారంగా వాహనాలు ఆపి.. పత్రాలు లేని వాహనాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలా నెలలో ఐదారుసార్లు వసూళ్లకు పాల్పడుతున్నారని..ఏ రోజూ కూడా పర్యవేక్షించాల్సిన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీఓ కనిపించరని వాపోతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై కేసులు రాసే అధికారి అక్కడ లేకపోవడం గమనార్హం. ఆర్టీఏ నిబంధనల ప్రకారం ఎంవీఐ, ఆర్టీఓ స్థాయి అధికారి లేకుండా వాహన తనిఖీలు చేయకూడదు. అందులోనూ తనిఖీ బృందానికి యూనిఫాంతో పాటు నేమ్ ప్లేట్స్ ఉండాల్సిందే. కానీ నేమ్ ప్లేట్ లేకుండా తనిఖీ అధికారి లేకుండా వాహనాలను ఆపి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలా వసూళ్లు చేసిన సొమ్ము ఎవరి జేబులోకి వెళ్తుంది? తనిఖీలు చేస్తున్న వారు నిజంగానే ఆర్టీఏ సిబ్బందేనా? నెల రోజుల్లో వివిధ రకాల వాహనాల యజమానుల నుంచి సుమారు వేలాది రూపాయలు వసూలు చేశారని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ స్పందించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారులకు తెరుస్తున్న ద్వారాలు

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో దళారులు ఆడిందే ఆటగా మారింది. ఫైల్‌కు ఇంత అంటూ కొందరి అధికారులతో ఒప్పందం కుదుర్చుకొని పనులు కానిస్తున్నారు. అమాయకులను ఆశ్రయించి దళారులు వారి వద్ద నుంచి డబ్బులు గుంజీ పనులు చేయిస్తున్నారని ఓ మహిళ తెలిపారు. నిర్ణీత సమయం లోపు కావాల్సిన పనులను కూడా అధికారులు కావాలనే ఆలస్యం చేస్తున్నారు. దళారులను ఆశ్రయిస్తే మాత్రం పనులు త్వరితగతిన పూర్తవుతాయనేలా పరిస్థితులు ఖైరతాబాద్ కార్యాలయంలో ఉన్నాయని చెప్పారు.

ఇటీవల ఓ వ్యక్తి కారు రిజిస్ట్రేషన్‌కు వెళ్తే డాక్యుమెంట్లు సరిగా లేవని ఇబ్బంది పెట్టారు. ఆ వ్యక్తి అక్కడే ఉన్న ఓ దళారిని కలిసి విషయం వివరించగా, అతడు రూ.2వేలు డిమాండ్ చేశాడని.. అప్పగించి పని పూర్తి చేసుకున్నానని వివరించాడు. కార్యాలయ పనివేళలు ముగిసిన అనంతరం దళారులంతా వందలాది దరఖాస్తులు పట్టుకుని ఖైరతాబాద్ కార్యాలయంలో పనులు చేయిస్తుంటారు. పనివేళలు కాకున్నా.. వారికి ద్వారాలు తెరుస్తారు ఆర్టీఏ సిబ్బంది. ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'యోగ'ం శరణం గచ్ఛామి

ఆరోగ్య యోగం.. ఆనంద భాగ్యం

గ్రేటర్‌వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, సామాన్యులు ఆసనాలు వేసి.. యోగా దినోత్సవ విశిష్టతను చాటారు. నెక్లెస్‌రోడ్‌లోని సంజీవయ్య పార్కులో తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా డే వేడుకల్లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, నటి కౌముది, కార్పొరేటర్ సుచిత్ర, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నేత మోతె శోభన్‌రెడ్డి పాల్గొని ఆసనాలు చేశారు.

రాంగ్‌రూట్‌లో వెళ్తే.. జైలుకే

మూడేండ్ల వరకు శిక్ష

124 ప్రాంతాల్లో ఏఎన్‌పీఆర్ కెమెరాలు

ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాంగ్ రూట్ వెళ్తున్నారా తస్మాత్ జాగ్రత్తా...! ఇక నుంచి ఎఫ్ఐఆర్ నమోదు చేసి జైలుకు పంపుతారు. ఈ మధ్య కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసులే ఉండటంతో ట్రాఫిక్ నియమాలను మరింత కఠినంగా అమలు చేసేందుకు సైబరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే మొదటి సారిగా రాంగ్ రూట్‌లో ప్రయాణించే వాహనదారులపై 336 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మొదలు పెట్టారు సైబరాబాద్ పోలీసులు. రాంగ్‌రూట్‌లో వచ్చి పట్టుబడిన వారిపై సంబంధిత లా అండ్ ఆర్డర్ ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చార్జీషీట్ దాఖలు చేస్తారు.

శుక్రవారం ఒక్కరోజే..

శుక్రవారం ఒక్కరోజే కమిషనరేట్ పరిధిలో రాంగ్‌రూట్ వాహనాలు నడిపిన 93 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అందులో 11 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. స్టేషన్ల వారీగా పరిశీలిస్తే గచ్చిబౌలి పీఎస్ పరిధిలో అత్యధికంగా 32 మంది రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ పట్టుపడ్డారు. వారిలో నలుగురిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో ఐదు మంది పట్టుబడగా, వారిలో ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. కూకట్‌పల్లి పరిధిలో ముగ్గురు పట్టుబడగా, వారిలో ఒకరిపై, మాదాపూర్‌లో ఆరు మంది పట్టుబడగా, వారిలో ఒకరిపై, నార్సింగి ఠాణా పరిధిలో 11 మంది పట్టుబడగా, వారిలో ఒకరిపై, రాయదుర్గం పరిధిలో 20 మంది పట్టుబడగా, వారిలో ఇద్దరిపై, జీడిమెట్ల పరిధిలో 16 మంది పట్టుబడగా, వారిలో ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

రాంగ్‌సైడ్ డ్రైవింగ్ ప్రమాదకరం

- జాయింట్ సీపీ(ట్రాఫిక్) జోయల్ డేవిస్

రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వల్ల రాంగ్‌సైడ్ వచ్చే వాహనదారులకే కాకుండా ఇతర వాహనదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరం. జరిమానాలు వేసినా నిబంధనల ఉల్లంఘనులు తగ్గడం లేదు. అందుకని రాంగ్ రూట్ డ్రైవింగ్‌కు పాల్పడే వాహనదారులపై సెక్షన్ 336 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నాం. ఈ కేసుల్లో మూడేండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. కొన్ని సార్లు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా పడవచ్చు. రాంగ్ రూట్ డ్రైవింగ్ చేసే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఇంతకు ముందు లేదు. మొదటిసారిగా గత నెలలోనే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చాం. గత నెలలో కమిషనరేట్ పరిధిలో మొత్తం 250 వాహనాలపై కేసులు పెట్టాం. కమిషనరేట్ పరిధిలో తరచూ ఎక్కువగా రాంగ్‌రూట్ వెళ్లేందుకు అవకాశాలున్న 124 ప్రాంతాలను గుర్తించాం. ఈ ప్రాంతాల్లో ఏఎన్‌పీఆర్ కెమెరాలు అమరుస్తున్నాం. ఈ కెమెరాలు రాంగ్‌రూట్ వెళ్లే వారిని గుర్తించి ఫొటోలు తీస్తాయి. వాటి ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తాం.

ట్రాఫిక్ నియంత్రణకు 80 మంది మార్షల్స్

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్‌సీఎస్‌సీ 50 మంది, రహేజా మైండ్‌స్పేస్ వారు 30 మందిని ట్రాఫిక్ మార్షల్స్‌ను కేటాయించేందుకు ముందుకు వచ్చినట్లు జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. శుక్రవారం ఎస్‌సీఎస్‌సీ, ఐటీ కంపెనీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పాల్గొని ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు సమాజ సేవల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు.వారి సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌పై పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ, దక్షిణ కొరియా, హెచ్‌ఈ రాయబారి చాంగ్ జే బోక్ బృందం నిర్వహించిన సమన్వయ సమావేశంలో సీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు 18 ఏండ్లుగా వారి వ్యక్తిగత సమయాన్ని సమాజ సేవకు కేటాయిస్తూ పోలీసులకు సహకరిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సేఫ్టీ అండ్ సెక్యూరిటీపై ఎస్‌సీఎస్‌సీ పనితీరు, సాధించిన ఫలితాలను దక్షిణ కొరియా నుంచి వచ్చిన రాయబార బృందానికి ఎస్‌సీఎస్‌సీ ప్రధాన కార్యదర్శి రమేశ్ కాజా, పద్మప్రియ వివరించారు.

ఎస్‌సీఎస్‌సీ, దక్షిణ కొరియా, హెచ్‌ఈ రాయబారి చాంగ్ జేబోక్ బృందంతో సమావేశమైన సీపీ అవినాశ్ మహంతి

ఇక్రిశాట్ స్టార్టప్‌లకు 'ఎస్‌బీఐ' ప్రోత్సాహం

సిటీబ్యూరో, జూన్ 21(నమస్తే తెలంగాణ) : ఆధునిక సాగు విధానాలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఇక్రిశాట్ కృషి చేస్తున్నది. ఓ వైపు సాగు పరిశోధనలు మరోవైపు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను వెతికేందుకు అధునాతన సాంకేతికతను ప్రోత్సహిస్తున్నది. ఇందులోభాగంగానే అగ్రిటెక్ స్టార్టప్‌లు నెలకొల్పుతూ.. వినూత్న ఆవిష్కరణలను రూపొందిస్తున్న ఇక్రిశాట్‌కు స్టేట్ బ్యాంక్ ఇండియా ఫౌండేషన్ సహకారం అందించనున్నది. ఈ క్రమంలో స్టార్టప్ కంపెనీలు నిర్వహిస్తున్న ప్రాజెక్టులకు సీఎస్‌ఆర్ కార్యక్రమం ద్వారా నిధులు సమకూర్చనున్నది. వ్యవసాయ రంగాన్ని టెక్నాలజీతో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నది. ఎస్‌బీఐ ఫౌండేషన్ బృందం తాజాగా ఇక్రిశాట్‌ను సందర్శించి పరిశోధనలపై చర్చించింది. క్యాంపస్‌ను సందర్శించిన ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎండీ సంజయ్ ప్రకాశ్ ఇక్రిశాట్‌లోని స్టార్టప్ నిర్వాహకులను అభినందించారు.

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ టాక్

సిటీబ్యూరో, జూన్ 21(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌లో రీసెర్చ్ టాక్ నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా లైఫ్ సైన్సెస్ రంగంలో జరుగుతున్న పరిశోధనలను విస్తృతం చేసేలా ప్రతి నెలా నిపుణుల బృందం ప్రత్యేక చర్చాగోష్ఠిని ఏర్పాటు చేస్తున్నది. శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ రీసెర్చ్ టాక్ కార్యక్రమంలో సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఉల్లాస్ కొల్తూర్ 'ప్లాస్టిసిటీ అండ్ మెమొరీ ఫ్రం మాలిక్యూలస్ టూ ఫిజియోలాజీ' అంశంపై ప్రసంగించారు. మానవ ఆరోగ్య సంరక్షణలో బయాలజీ పరిశోధనలు అత్యంత కీలకంగా మారుతున్నాయని అభిప్రాయపడ్డారు.

వానలు లేక.. నార్లు పోయక..

వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపు

మేడ్చల్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): వానల కోసం రైతన్నలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఆశించినంత మేర వానలు పడకపోవడంతో ఇప్పటి వరకు వరి నార్లు పోయలేదు. ఈ నెల మొదటి వారం నుంచే వరి పంట పండించే రైతులు నార్లు వేసే పనిలో నిమగ్నమయ్యేవారు. అయితే ఇప్పటి వరకు అనుకున్న మేరకు వానలు పడకపోవడంతో వరి నార్లు పోయలేదు. దీంతో ఈ ఏడు వరి నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వర్షాకాలంలో వరి పంట సాగు 18 వేల ఎకరాల సాగు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా వరినాట్లను 20 ఎకరాల్లో మాత్రమే వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 5 వందల ఎకరాల్లో నారు వేసే పని పూర్తి కావాల్సి ఉంది. అయితే వానాకాలం సీజన్‌లో వరి పంట సాగుకు ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తున్నది.

కరెంటు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో?

వానలు కురవకున్నా.. బోరుబావుల నుంచి వచ్చే నీటితో వరి నాట్లు వేద్దామన్నా.. కరెంట్ సరఫరాలో సమయపాలన లేక పోవడంతో రైతుల్లో సందిగ్ధం నెలకొన్నది. కరెంటు ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి ఉన్నదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటలు నాణ్యమైన కరెంటు సరఫరా ఉండేదన్నారు.

జీషాన్ హోటల్‌లో తనిఖీలు చేసిన బండ్లగూడ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

హోటళ్లు.. ఫుడ్ కంపు

శంషాబాద్ రూరల్/బండ్లగూడ, జూన్ 21 : శంషాబాద్ పట్టణంలోని పలు హోటళ్లలో శుక్రవారం మున్సిపల్ శానిటేషన్ అధికారి లక్ష్మయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మార్క్ కిచెన్, శ్రీ వెంగమాంబ, వెంగమాంబ, స్వాగత్ గ్రాండ్ హోటళ్లలో పరిశుభ్రత లేకపోవడంతో పాటు చికెన్ ఇతర పదార్థాలు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించి రూ. 12వేల జరిమానా విధించారు. అలాగే బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కమిషనర్ శరత్ చంద్ర జీషాన్ హోటల్‌లో తనిఖీ చేశారు. ఫ్రిడ్జిలో కుళ్లిన మాంసంతో పాటు పాయకు ఉపయోగించే మేక కాలు, చికెన్ వంటివి గుర్తించి..సీజ్ చేశారు. అనంతరం నిర్వాహకులకు 10 వేల రూపాయల జరిమానా విధించారు.

హాస్టల్‌లో ఆహారం పరిశుభ్రంగా ఉండాలి

జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 21: జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలోని హాస్టల్‌లో విద్యార్థులకు అందించే భోజనం పరిశుభ్రంగా ఉండాలని.. రుచి, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని వర్సిటీ రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం వర్సిటీలోని మంజీరా హాస్టల్‌ను రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ జి. వెంకటనర్సింహారెడ్డి, చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ దుర్గాకుమార్, పీఆర్‌వో ప్రసన్న పరిశీలించారు. హాస్టల్‌లోని వంటగదిలో ఉన్న వంట పాత్రల శుభ్రత, కూరగాయల నాణ్యత, వంట చేసేవారి పరిశుభ్రతతో పాటు వివిధ అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. ఆ సమస్యలను వెంటనే హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలన్నారు. బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి రాకుండా చూడాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సరైన వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రిజిస్ట్రార్ వెంట పలువురు కళాశాల అధికారులు ఉన్నారు.

వర్సిటీ మంజీరా హాస్టల్ పరిశీలనలో రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ వెంకటనర్సింహారెడ్డి